క్లుప్తంగా

జగనన్న పాల వెల్లువపై అవగాహన

ఏ.కొండూరు: జగనన్న పాల వెల్లువ పాల కేంద్రాల్లో పాలు పోసి పాడి రైతుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో స్వయం సహాయ సంఘ మహిళలకు జగనన్న పాల వెల్లువపై అవగాహన కల్పించి వారికి పాడి గేదెలు కొనుగోలు చేసుకోవటానికి రుణాలు ఇప్పించాలన్నారు. పాలను ఈ పాల కేంద్రాల్లో పోసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం డ్వాక్రా గ్రూపులకు అనేక రకాల రుణాలు అందిస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ కేఎస్ఎస్ రవికాంత్, పశువైద్యాధికారి భరత్, వెలుగు ఏపీఎం ఆర్ సత్యం, సీసీలు పాల్గొన్నారు.

సూర్యనారాయణరెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి సతీమణి నాగావళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి మాజీ ఏఎంసీ చైర్మన్‌ను బుధవారం పరామర్శించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీలు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మైలవరం: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ చార్టర్డ్ ఎకౌంటెంట్ సుంకర అక్కయ్యనాయుడు తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో 150 మంది విద్యార్థులకు అక్కయ్యనాయుడు సౌజన్యంతో అచ్చు కాపీ పుస్తకాలు బుధవారం అందజేశారు. కాపీ పుస్తకాలు ప్రతి రోజు రాయడం వలన దస్తూరి అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉడతా లక్ష్మీనారాయణ, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో బుధవారం మరణించిన ముష్టికుంట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యురాలు మైసాక్షి లక్ష్మీనరసమ్మ అంత్యక్రియల నిమిత్తం సంఘ చైర్మన్ బండి రవికుమార్ ఆర్థిక సాయం అందజేశారు. సహకార సంఘ బైలా ప్రకారం సభ్యులు మరణించినపుడు రూ.10 వేలను మట్టి ఖర్చుల కింద అందజేసినట్లు రవికుమార్ తెలిపారు. కొమ్మిరెడ్డిపల్లి సర్పంచి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలి

డీఎంహెచ్‌వో సుహాసిని



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కుటుంబ డాక్టర్ వైద్య సేవలు ప్రజల వద్దకు చేరాలని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని అన్నారు. మండలం పరిధిలోని గుంటుపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్‌నెస్ సెంటర్‌లో రోజువారీ వచ్చే రోగులపై ఆరాతీశారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీరు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు వ్యాధి నిరోధక టీకాల రిజిష్టర్ పరిశీలించి తల్లిపాల వారోత్సవాల అమలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు సరఫరా చేస్తున్న వైఎస్సార్ పోషణ అభియాన్ కిట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి వెళ్లి పింఛను అందజేత



జి.కొండూరు: మండలంలోని వెలగలేరు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు కొవ్వల వెంకటేశ్వరరావు అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు సుజన బుధవారం ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేసింది. పింఛన్‌ను అందించడం పట్ల వెంకటేశ్వరరావు సుజనకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వలంటీరును అభినందించారు.

నేడు ఆయిల్‌పామ్ మెగా మేళా

ఏ.కొండూరు: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ఆయిల్‌పామ్ మెగామేళా గురువారం నిర్వహిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి బి. నరేంద్ర బుధవారం తెలిపారు. అర్హులైన రైతులకు ఆయిల్‌ఫామ్ మొక్కలు, డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఆయిల్‌ఫామ్ సాగు చేయాలనుకునే రైతులు ఈ మేళాలో పాల్గొనాలని కోరారు.

మహిళల సంక్షేమానికి మరిన్ని పథకాలు

ఎమ్మెల్యే కె.రక్షణనిధి



తిరువూరులో సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: మహిళల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని పథకాలు అమలుచేస్తుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో గర్భిణులు, బాలింతలకు రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండడానికి ఈ రేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాడు–నేడులో అంగన్‌వాడీ కేంద్రాలకు ఆధునిక భవనాల నిర్మాణంతో పాటు ప్రీ స్కూల్లో విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధనకు మెటీరియల్ ప్రభుత్వం సరఫరా చేసిందని తెలిపారు. నూతన విద్యావిధానంలో పాఠశాల విద్యకు ప్రీ స్కూల్ అనుసంధానం చేశారన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఐసీడీఎస్ సీడీపీవో సత్యవతి, నగరపంచాయతీ కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

పోషకాహారం సద్వినియోగపర్చుకోండి

గంపలగూడెం: గర్భిణులు, బాలితలకు సంపూర్ణ ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగపర్చుకోవాలని గంపలగూడెం ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటే వారి బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్న ఆశయంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సర్పంచ్ కోట పుల్లమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెదురు లింగమ్మ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం చిన్న ఆనందం, వైఎస్సార్ సీపీ నాయకులు అల్లు కృష్ణారెడ్డి, కోట సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మునిలక్ష్మి, రేవతిలు గంపలగూడెం పరిధిలోని వారికి కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ పాలడుగు జోత్స్న బుధవారం గుంటుపల్లిలో ప్రారంభించారు. ఎంపీడీవో రామకృష్ణ నాయక్, తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ భుక్యా కవితతో కలిసి గర్భిణులు, బాలింతలకు అందజేశారు. కొండపల్లి నాలుగో సచివాలయంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, 9వ వార్డు కౌన్సిలర్ కాటమరాజు దుర్గాభవానీ, మాజీ సర్పంచ్ కాంద్రకొండ గురవయ్య, సూపర్‌వైజర్ రమాదేవి పంపిణీ చేశారు. 2, 5వ సచివాలయాల్లో కౌన్సిలర్లు బి.నాగరాజకుమారి, చైతన్య స్రవంతి, దయాసాగర్, 8వ వార్డులో షీనాబేగం, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పోషణ కిట్లు అందజేశారు. జానీపాషా, అంగన్‌వాడీలు, పాల్గొన్నారు.



గంపలగూడెంలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, సర్పంచ్ పుల్లమ్మ



కిట్లు అందజేస్తున్న మిక్కిలి శరభయ్య, కౌన్సిలర్‌లు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. రోలుపడి, అక్కపాలెం, మల్లేల, కోకిలంపాడు, ఆంజనేయపురం, వావిలాల, ఎర్రమాడు, ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కిట్లను పంపిణీ చేశారు.

మాతా శిశు ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాతా శిశు ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కార్యక్రమం చేపట్టి వారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్లను పంపిణీ చేస్తుందని గొల్లపూడి సహకార బ్యాంక్ చైర్మన్ బొర్రా వెంకటరావు అన్నారు. గొల్లపూడి అంబేడ్కర్‌నగర్‌లోగల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు కిట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి శిశువు జన్మించే వరకు ఎప్పటిప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించటంతోపాటు వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంపీటీసీలు ధనేకుల చౌదరి, పైలా ఆదినారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, జీఎమ్‌కెలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

మైలవరం: ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం గర్భిణులు, బాలింతల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మార్కెట్ యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. సీడీపీఓ పుష్పలత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని చెప్పారు. సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ పోషకాహారాన్ని నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. మైలవరం మండలంలో 13 అంగన్‌వాడీ కేంద్రాలలో 242 మంది గర్భిణులు, బాలింతలు, 587 మంది 7 నుంచి 3 సంవత్సరాలు పిల్లలు ఉన్నారన్నారు. జెడ్పీటీసీ సర్నాల తిరుపతిరావు, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, వైస్ ఎంపీపీ షేక్ రహీమ్ ప్రసంగించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో రక్తహీనత నివారణ

జి.కొండూరు: గర్భిణిలు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు ప్రభుత్వం పోషకాహార కిట్‌లను అందిస్తుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అందిస్తున్న టేక్‌హోమ్ రేషన్ కిట్‌ల పంపిణీ బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి ఎంపీపీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్పంచ్ మండల అరుణ, కో ఆప్షన్ సభ్యుడు హుస్సేన్, మండల వైద్యాధికారిణి డాక్టర్ శ్రీకల్యాణి, ఎంఈఓ వెంకటనర్సింహారావు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంతో ఉపయోగకరం

విస్సన్నపేట: గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఎంతో ఉపయోగకరం అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. షాదీఖానా వద్ద వైఎస్సార్ సంపూర్ణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని వైఎస్సార్ సంపూర్ణ పోషణలో ఇంటివద్దకే అందిస్తామని చెప్పారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎన్‌వి కుటుంబరావు, తహసీల్దార్ చంద్రశేఖర్, వైద్యాధికారి శ్రీనివాస్, సీడీపీఓ సత్యవతి, ఏసీడీపీఓ ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజేష్, పవన్ పాల్గొన్నారు. మండలంలోని తాతకుంట్ల గ్రామంలో సంపూర్ణ పోషణ కిట్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కాలీషా పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కిలేశపురం, ఇబ్రహీంపట్నం 106, 133, 134, 135, 310 అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కిట్లు బుధవారం పంపిణీ చేశారు. కిట్లలో బలవర్ధకమైన పోషణ బియ్యం, పాలు, కందిపప్పు, కోడి గుడ్లు, రాగిపిండి, అటుకులు, నూనె, బెల్లం, వేరుశెనగ చిక్కీ, ఖర్జూరాలతో కూడిన పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సర్పంచ్ కాకి దేవమాత, పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబశివారెడ్డి తెలిపారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు జరిపారు. పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, ఎమ్మెస్కే కళ్యాణి, లంకే అంకమోహనరావు, నల్లమోతు చిన్నయ్య, దయాకర్, రవి, పండు, రాధా, కృష్ణ, పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. రాఘవాపురం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పథకాన్ని జెడ్పీటీసీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్‌ను గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ–1 చాట్ల రాబర్టు, సీనియర్ నాయకులు రామినేని వీరస్వామినాయుడు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, డాక్టర్ సందేష్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, షేక మీరా సాహెబ్, సూపర్వైజర్ కుమారి, మాజీదాబేగం, అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్‌హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ భూక్య గనియా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, సర్పంచులు బి. ఝాన్సీ, బి.సావిత్రి, అంగన్వాడీ సూపర్‌వైజర్ డి. శివకుమారి, పి.వెంకట కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ తదితరులు



వైఎస్సార్ పోషణ కిట్లను అందచేస్తున్న వెంకటరావు, చౌదరి



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి



కిట్లు అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి, ప్రసన్న రాణిస్వామి, మంజుభార్గవి, తిరుపతిరావు



కిట్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు



కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దేవమాత, మునేశ్వరరావు తదితరులు

సకల సౌకర్యాలమయంగా పల్లె సీమలు

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



సింహాద్రిపురంలో రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి, విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని కోనేరుపేటలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. అనంతరం 10 పడకల వార్డును, ఫార్మసీ, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, వైద్యుల గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేద ప్రజలకు ప్రభుత్వ రంగంలోని వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. రమణక్కపేటలో ఇటీవలనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించామని తెలిపారు. మరో రెండు నెలల్లో ఎమ్మార్ అప్పారావు కాలనీలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఏరియా ఆసుపత్రిలో రూ.21 కోట్లతో ఆధునిక వసతులతో కూడిన భవన నిర్మాణం పూర్తికావచ్చిందని చెప్పారు. పీజీ కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో అకడమిక్ భవనాన్ని నిర్మించడంతో పాటు బాలికల హాస్టల్‌కు అదనపు గదులను నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఏనాడైనా అభివృద్ధి చేశాడా అని నిలదీశారు. నూజివీడుకు మూడు సార్లు వచ్చి మూడు మొక్కలు నాటి వెళ్లిన చరిత్ర చంద్రబాబుదని ఎద్దేవా చేశారు. ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యన్నారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, కౌన్సిలర్ తుమ్మూరు మౌనిక, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల మాధవి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, వైద్యాధికారులు నరేంద్రకృష్ణ, గంగాధరరావు, సాయిసుధ, కొలుసు సౌమ్య, సుష్మ, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు జోగారావు, పల్లె రవీంద్రరెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మునునూరు: జగనన్న పాలనలో పల్లె సీమలన్నీ సకల సౌకర్యాలమయంగా మారుతున్నాయని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. మండలంలోని కొర్లగుంట, శివారు గ్రామాలు సింహాద్రిపురం, సింహాద్రి అప్పారావు పేటల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, సీసీ రహదారులను బుధవారం ఆయన ప్రారంభించారు. పంచాయతీరాజ్ డీఈఈ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.21.80 లక్షల నిధులతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో 400 మీటర్ల పొడవున నిర్మించిన ఐదు అంతర్గత సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో పల్లెసీమల్లోని కార్యాలయ భవనాలు, రహదారుల నిర్మాణాలతో సర్వాంగ సుందరంగా మారుతున్నాయని చెప్పారు. రైతుల సౌకర్యం కోసం కొర్లగుంటలో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్, ధాన్యపు గోదామును అతి త్వరలోనే నిర్మించనున్నట్లు చెప్పారు. ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు కె.రాజానాయన, పి.గంగాధర్, జిల్లా రైతు సలహా మండలి నేత పల్లె రవీంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు వరం



నూజివీడు: తల్లిపాలు బిడ్డకు వరమని ఐసీడీఎస్ సీడీపీవో ఎస్‌వై నూరాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంతో పాటు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీవో సందర్శించి వారోత్సవాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యతపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలను తప్పకుండా బిడ్డకు తాగించాలని తెలిపారు. బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రసవించిన నాటి నుంచి ఆరు నెలలు పాటు పిల్లలకు పాలివ్వాలని సూచించారు. తల్లులు పిల్లలకు పాలివ్వకుండా డబ్బా పాలు పట్టిస్తే భవిష్యత్తులో అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని చెప్పారు. తల్లిపాలు ఇస్తేనే తల్లికి, బిడ్డకు మంచిదన్నారు.

పోలీసు విధుల నిర్వహణ లోనే ఉంచాలని వినతి



తిరువూరు ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెస్కేలు

తిరువూరు: తమను మహిళా పోలీసు విధుల నిర్వహణలోనే కొనసాగించాలని కోరుతూ మండలంలోని సచివాలయాల ఎమ్మెస్కేలు బుధవారం ఎమ్మెల్యే రక్షణనిధికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తమను మహిళా పోలీసు విధుల నుంచి తప్పించడంతో గ్రామ స్థాయిలో ప్రజాసంక్షేమానికి తాము పూర్తిస్థాయిలో కృషి చేయలేకపోతున్నామని తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమంతో పాటు మహిళా సంరక్షణకు పోలీసు శాఖకు అనుబంధంగా పనిచేసే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎమ్మెస్కేల రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

రెడ్డిగూడెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ని జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ రామినేనిదేవి ప్రవణ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలు మెరుగుపర్చాలని, వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ మల్లాది రాణీ, సీనియర్ నాయకులు రామినేని వీరస్వామినాయుడు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగి ప్రసాద్‌కు సత్కారం

గంపలగూడెం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గంపలగూడెంశాఖలో నగదు అధికారిగా పనిచేసి తిరువూరు బ్రాంచికి బదిలీ అయిన స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ యూనియన్ రీజనల్ సెక్రటరీ బీఎల్‌హెచ్ ప్రసాద్‌ను బుధవారం సత్కరించారు. బ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాద్‌కు మేనేజర్ తోట బాబూరావు శాలువా కప్పి సన్మానించారు. ఆయన స్థానంలో తిరువూరు నుంచి అభిలాష్‌బాబు వచ్చి విధుల్లో చేరారు. అకౌంటెంట్ సత్తిబాబు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, చంద్రమౌళి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏసీ ఉద్యోగుల నిరసన

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఎన్టీటీపీఎస్ గేటు వద్ద ఏడోరోజు నిరసన కార్యక్రమం కొనసాగింది. జేఏసీ నాయకులు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో తలమానికంగా ఉండే విద్యుత్ ఉద్యోగులు సమస్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, సమానపనికి సమానవేతనం ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరశింగరావు, ఎన్ సీహెచ్ శ్రీనివాస్, మహేష్, ఎం.మోహనరావు, జాన్‌రాజ్, పాలప్రసాద రావు, కార్మికులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి



పెనుగొలనులో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పెనుగొలను(గంపలగూడెం): జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్వాతంత్రోద్యమంలో ఆయన సేవల్ని పలువురు కొనియాడారు. నాటి నేతలను ఆదర్శంగా తీసుకొని యువత పనిచేయాల్సి ఉందన్నారు. హెచ్ఎం ఏవీ నరసింహారావు, గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

గానుగపాడు(తిరువూరురూరల్): స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని మండలంలోని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో వెంకయ్య పోషించిన వీరోచిత పాత్రను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి విద్యార్థులకు వివరించారు. పింగళి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జెండాతో దేశానికి ఖ్యాతి....

మునునూరు: మూడు రంగులతో దేశ జాతీయ జెండాను రూపొందించడంతోనే ప్రపంచ దేశాల్లో మన దేశానికి మంచి గుర్తింపు లభించిందని జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని లోపూడి ఆశ్చర్య పాఠశాలలో జాతీయ జెండా నిర్మాత పింగళి వెంకయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రంగుల జెండాతో మన దేశానికి ఖ్యాతి లభించిందన్నారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకురాలికి డాక్టరేట్ ప్రదానం



జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ప్రొఫెసర్ ఆదిశేషారెడ్డి

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగంలో అధ్యాపకురాలు ఆర్.జయలక్ష్మి విక్రమపురి యూనివర్సిటీ కామర్స్ విభాగంలో కాస్ట్ క్రెడిట్ టు మెరైన్ ఫిషర్‌మెన్ ఇన్ ప్రకాశం జిల్లా ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు బుధవారం తెలిపారు. ఈ పరిశోధనను ప్రొఫెసర్ పి. వెంకటరావు(రిటైర్డ్) కామర్స్ విభాగం, విక్రమపురి యూనివర్సిటీ, కావలి పర్యవేక్షణలో చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు రుణ సదుపాయాలు మీద అవగాహన కల్పించడంతో పాటు వారి రుణ అవసరాలను తీర్చడంలో మార్గం సుగమం అవుతుందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన జయలక్ష్మిని ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది అభినందించారు.